మంథనిలో మరిన్ని పరిశ్రమలు

- రాబోయే రోజుల్లో ఏర్పాటు చేయిస్తా
- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

జ్యోతిప్రజ్వలన చేసి కంపెనీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, సెప్టెంబర్ 14: రాబోయే రోజుల్లో మంథనికి మరిన్ని పరిశ్రమలు, కంపెనీలు తీసుకువచ్చి ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. మంథని పట్టణ శివారులోని గోదావరిఖని ప్రధాన రహదారి వెంట గీట్లస్ హబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్ లేయన్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్రాంచ్‌ను శనివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయించామన్నారు. స్కిల్ యూనివర్సిటీని సైతం మన ప్రాంతంలో స్థాపించి విద్యార్థులకు కోచింగ్ ఇప్పిస్తామన్నారు. తర్వాత కంపెనీ చైర్మన్, ప్రతినిధులను సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సన్మానించారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

మంథని పట్టణంలోని గాంధీచౌక్‌లోని మండపంలో కొలువుదీరిన గణనాథుడిని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమాత్యుడు ప్రత్యేక పూజలు చేయగా, వేదపండితులు ఆశీర్వదించారు. ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమాసురేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్ కొట్టె పద్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఐయిలి ప్రసాద్, మాజీ ఎంపీపీ కొండా శంకర్, ఉత్సవ సమితి అధ్యక్షుడు కొమురోజు చంద్రమోహన్, కార్యదర్శి పెండ్యాల రామ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వొల్లాల అశోక్, ఆర్థిక కార్యదర్శి రమేశ్, కౌన్సిలర్ రవి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ప్రవళిక పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించండి

మంథని ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని రావికంటి సతీశ్‌కుమార్ శనివారం మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందించారు. పార్టీలో మొదటి నుంచి విధేయుడిగా అహర్నిషలు కృషి చేస్తున్నానని, తనకు అవకాశం కల్పించాలని కోరారు.

అరెస్టులు అప్రజాస్వామికం

- డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన పార్టీ శ్రేణులు

పెద్దపల్లి: జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దపల్లి, సెప్టెంబర్14: జిల్లాలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పర్యటన సందర్భంగా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉషను హౌస్ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ పార్టీ శ్రేణులు అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. 'ఇదేమీ రాజ్యం.. ఇదేమీరాజ్యం, దొంగలరాజ్యం.. దొపిడీరాజ్యం, వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన'.. అంటూ నినదించారు. ఇక్కడ నాయకులు బండ నిఖిల్ యాదవ్, పల్లె రాకేశ్, బీరం రవి, కన్నం శ్రావణ్, గాజుల రమేశ్, కొల్లూరి నర్సయ్య, మహేశ్, సతీశ్, వంశీ ఉన్నారు.

ధర్మారం, సెప్టెంబర్ 14: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పర్యటన ముగిసిన తర్వాత విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్ మాట్లాడుతూ, మంత్రుల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను కక్షగట్టి అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం అనగతొక్కుతుందని ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీనియర్ నేత జితేందర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుర్రం మోహన్‌రెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లు, మాజీ ఎంపీటీసీలు మిట్ట తిరుపతి, తుమ్మల రాంబాబు, నాయకులు ఎగ్గెల స్వామి, కూరపాటి శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్, దేవి నలినీకాంత్, ఆవుల వేణుగోపాల్, కొత్త మోహన్, దేవి వంశీకృష్ణ, దేవిరాజేందర్, జిల్లెల కనకయ్య, ఐత వెంకటస్వామి, ఎండీ అజాంబాబా, గందం తిరుపతి, సల్వాజి మాధవరావు, మహిళా నేతలు ఆవుల లత, మార్క సంధ్య, మోకనపల్లి రాజమ్మ పాల్గొన్నారు.

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్14: బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అమానూషమని పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజుకుమార్ ఆరోపించారు. శనివారం భట్టివిక్రమార్క జిల్లా పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయాడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టయిన వారిలో కౌన్సిలర్లు లైశెట్టి భిక్షపతి, పూదరి చంద్రశేఖర్, పస్తం హనుమంత్, రేవల్లి స్వామి, నాంసాని సరేశ్‌బాబు, ఈరబోయిన శ్రీనివాస్, వునుకొండ సునీల్ ఉన్నారు.

ధర్మారం: పోలీసుల అదుపులో నుంచి విడుదలైన తర్వాత మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లి టౌన్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కుందనపల్లి ఎల్‌పీ గేట్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్ఐ

అక్రమంగా రైల్వే పట్టాలు దాటడం నేరం

జ్యోతినగర్ (రామగుండం), సెప్టెంబర్ 14: రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ మూసివేసినా ప్రయాణికులు అక్రమంగా రైల్వే పట్టాలు దాటి పోవడం చట్టరీత్యా నేరమని రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ పేర్కొన్నారు. రామగుండం రైల్వేస్టేషన్ సమీప కుందనపల్లి లెవెల్ క్రాసింగ్ గేట్ వద్ద శనివారం ప్రయాణికులకు రైలు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, పెద్దంపేట, కుందనపల్లి లెవెల్ క్రాసింగ్ గేట్ వద్ద కొందరు ప్రయాణికులు గేట్ మూసివేసినా రైలు పట్టాలు దాటిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కాపరులు పశువులను రైల్వే ట్రాక్‌పై తీసుకువస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పుట్‌బోర్డు ప్రయాణం, కదిలే రైలును తొందరపడి ఎక్కుతూ ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. ఇక్కడ రామగుండం ఆర్‌పీఎఫ్ ఎస్ఐ క్రాంతికుమార్, ఏఎస్ఐలు సుభాష్, శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్ 14: తారుపల్లి హైస్కూల్‌లో విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామగల్ల సురేశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులే అసభ్యకరంగా ప్రవర్తించడం సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని ఆయన ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

యైటింక్లయిన్ కాలనీ, సెప్టెంబర్ 14: సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్‌ప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం నాయకులు ఏరియా వర్క్‌షాపు డీజీఎం ఎర్రన్నకు వినతిపత్రం అందజేశారు. ప్లేడేలు, తాగునీరు, మ్యాన్‌పవర్, ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు దశరథం గౌడ్, సత్యనారాయణ, సైదులు, రాయమల్లు, రవీందర్, వంగ సురేశ్, మసూద్‌అలీ, రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, వాసుదేవారెడ్డి, శ్యామ్, మొగిలి, యాదగిరి, రాజయ్య, సంపత్, వెంకటేశ్, రాజేశ్, మహేశ్, రాకేశ్, తదితరులు ఉన్నారు.

సీఎంపీఎఫ్ చిట్టీల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 14: ఆర్జీ-2 ఏరియాలోని వివిధ గనులు, డిపార్టుమెంట్ల ఉద్యోగులకు ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ శనివారం తన ఆఫీస్‌లో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీఎంపీఎఫ్ చిట్టీలను అందజేశారు. సీఎంపీఎఫ్‌లో ఏమైనా సవరణలుంటే సంబంధిత అధికారుల ద్వారా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇక్కడ గుర్తింపు సంఘం డివిజన్ కార్యదర్శి జీ రవీందర్, ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం ఎస్ సంతోష్‌కుమార్, అధికార ప్రతినిధి అనిల్ కుమార్, డీవైపీఎం వంశీధర్ ఉన్నారు.

పనుల అడ్డగింత

జూలపల్లి, సెప్టెంబర్ 14: తేలుకుంటలోని సర్వే నంబర్ 1393లో 20గుంటల స్థలాన్ని తొంటి బీరయ్య ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు.ప్రభుత్వ భూమిని ఎందుకు ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ గ్రామస్తులు సొల్లు శ్యామ్, చొప్పరి నర్సింగం, నేవూరి మల్లేశం, పిల్లి భూమయ్య, తీగల వీరేశం, నల్లాల శ్యామ్, పంజాల తిరుపతి, పోడేటి మహేందర్, తదితరులు ఉన్నారు.

మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు

కుట్టు మిషన్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

కమాన్‌పూర్, సెప్టెంబర్ 14: కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతామని అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. జూలపల్లిలోని ఆదర్శనగర్‌లో గల సాన గార్డెన్‌లో శనివారం ఇరుగురాల శ్రీజ, ఇరుగురాల రజితకు క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఇక్కడ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సభ్యులు అనవేని లక్ష్మీరాజం, బండ సాయిశంకర్, జబ్బర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు ఇంటి ఫర్నీచర్ దగ్ధం

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్14: పట్టణంలోని విఠల్‌నగర్‌లో శనివారం రాత్రి రామగుండం నగరపాలక సంస్థలో పనిచేసే కొడపాక మహేందర్ ఇంటికి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళ్తే.. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంట్లో ప్రతిష్ఠించుకున్న ప్రతిమ వినాయకుడికి దీపం పెట్టి పూజించిన అనంతరం మహేందర్ బయటకు వెళ్లాడు. దీపం మంటలు వ్యాపించి ఇంట్లోని బట్టలు, ఫర్నీచర్ కాలిపోయాయి. సమాచారం అందుకున్న గోదావరిఖని ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకోని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో దాదాపు రూ.50వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నారు.

ఆధార్ అప్‌డేట్ మరోసారి పొడిగింపు

కలెక్టరేట్, సెప్టెంబర్ 14 : పదేళ్ల క్రితం పొందిన ఆధార్‌కార్డులు ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మరోసారి గడువు పెంచింది. ఈ నెల 14న శనివారం నాటికే ఉడాయ్ ఇచ్చిన అవకాశం ముగిసిపోవడంతో మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటివరకు అప్‌డేట్ చేసుకోని ఆధార్ యూజర్లు డిసెంబర్ 14 వరకు చేసుకోవాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఉడాయ్ అధికార వెబ్‌సైట్ http.//myaadhar.uidai.gov.in లో ఆధార్‌నెంబర్, మొబైల్‌నెంబర్ ద్వారా లాగిన్ అయి, తమ వివరాలు ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చంటూ వెల్లడించింది. మీసేవా కేంద్రాల్లో రూ.40 చెల్లిస్తే అప్‌డేట్ చేస్తారని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈడీఎం డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ప్రాణాలమీదికి తెచ్చిన సెల్ఫీ సరదా

కాజీపేట, సెప్టెంబర్ 14: హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే సెంటింగ్ యార్డులో శనివారం ఓ యువకుడు రైలు బోగీ ఎక్కి సెల్ఫీ దిగుతుండగా విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు, 108 సిబ్బంది కథనం ప్రకారం.. హుజూరాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన పస్తం రాజు తన తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి కడిపికొండ చర్చిలో జరుగుతున్న క్రైస్తవ ఉత్సవాలకు వచ్చాడు. ప్రార్థనలు జరుగుతుండగా కొందరు పిల్లలతో కలిసి రాజు రైలు బోగీ ఎక్కి సెల్ఫీ దిగేందుకు రాంనగర్ సమీపంలోని సెంటింగ్ యార్డుకు వెళ్లాడు. యార్డులో ఆగి ఉన్న గూడ్స్ రైలు బోగీ ఎక్కిన సెల్ఫీ దిగుతుండగా, ఒక్కసారిగా హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి షాక్ గురయ్యాడు. స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం దవాఖానలో చేర్పించగా, ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉన్నది.

బొగ్గు కొరత రానీయవద్దు

- సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కొరత లేకుండా తగినంత బొగ్గు సరఫరా చేయాలని.. రోజుకు కనీసం రెండు లక్షల టన్నులు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ అధికారులను ఆదేశించారు. అందే పరిమాణంలో బొగ్గు రవాణా జరపాలన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఏరియా ఉత్పత్తి గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలతో ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటికీ నిలిచి ఉన్న నీటిని వెంటనే తొలగించాలని తెలిపారు. అవసరమైతే అదనపు పంపులు వినియోగించి బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రోజుకు కనీసం 14లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని ఆదేశించారు. రక్షణతో మెరుగైన ఉత్పత్తులు సాధించాలని పిలుపునిచ్చారు. భారీ వర్షాలతో మూడు నెలల్లో కోల్పోయిన ఉత్పత్తి నష్టాలను తిరిగి భర్తీ చేసుకునేందుకు అందరూ కృషి చేయాలని తెలిపారు. అలాగే కొత్త గూడెంలోని వీకేఓసీకి తొలి దశ అటవీ అనుమతులు లభించాయని, దీని వల్ల రానున్న రెండు నెలల్లో ఉత్పత్తికి కావాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు (ఈ అండ్ ఎం), జీ వెంకటేశ్వర్‌రెడ్డి (పీపీఅండ్ పా), జనరల్ మేనేజర్ కో ఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభాని, జీఎం (సీపీపీ) జక్కం రమేశ్, పలు ప్రాంతాల జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల కార్పొరేట్ జనరల్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ పరీక్ష రద్దు చేయాలి

గోదావరిఖని, సెప్టెంబర్ 14: సింగరేణి ఆర్జీ-1 పరిధిలో సివిక్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. శనివారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సెక్టార్ 1, 2, సివిక్ మెయింటెన్సీలో కార్మికులు పోస్టాఫీస్ దగ్గర చేపట్టిన నిరసనలో జేఏసీ నాయకులు మాట్లాడారు. 25-30 ఏండ్ల నుంచి పనిచేస్తున్న చట్టబద్ధ హక్కులకు నోచుకోని కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమవుతుంటే మెడికల్ పరీక్ష పేరిట ఉద్యోగ భద్రతకు అభద్రత నెలకొనే పరిస్థితి రావద్దన్నారు. యాజమాన్యం మెడికల్ పరీక్షను రద్దు చేస్తూ సర్క్యులర్‌ను జారీ చేయాలన్నారు. ఇక్కడ జేఏసీ నాయకులు కడారి సునీల్, తోకల రమేశ్, మద్దెల శ్రీనివాస్, శనిగల శ్రీనివాస్, అబ్దుల్ కరీం, శనిగారపు చంద్రశేఖర్, కార్మికులు కేతమ్మ, సతీశ్, సారయ్య, రమ, చంద్రారెడ్డి, లక్ష్మి, దుర్గయ్య, శ్రీనివాస్, శేషు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గోదావరిఖని, సెప్టెంబర్ 14: సింగరేణిలో మారు పేర్ల, విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం భాస్కర్‌రావు భవన్‌లో మారుపేర్ల, విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులు సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్‌లో జరిగే స్ట్రక్షర్ సమావేశాల్లో వీరి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఇక్కడ వైవీ రావు, కే స్వామి, ఆరెల్లి పోషం, ఎం సంపత్ ఉన్నారు.

హెల్త్ అసిస్టెంట్ కిరణ్‌పై వేటు

- శంకర్‌రావుకు అదనపు బాధ్యతలు
- 'నమస్తే' ఎఫెక్ట్

కోల్‌సిటీ, సెప్టెంబర్ 14: రామగుండం నగరపాలక సంస్థలో కొంత కాలం నుంచి అడ్డగోలుగా జరుగుతున్న డీజిల్ అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు బల్దియా చర్యలకు ఉపక్రమించింది. ఇటీవల నమస్తే తెలంగాణ దినపత్రికలో 'బల్దియాలో డీజిల్ దందాపై విజిలెన్స్' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలోని చెత్త సేకరణ ట్రాలీలలో డీజిల్ వినియోగంలో జరుగుతున్న గోల్‌మాల్‌పై వరుస కథనాలు రావడంతో కలెక్టర్ కోయశ్రీహర్ష తీవ్రంగా పరిగణించారు. కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో ప్రక్షాళన దిశగా చర్యలకు ఆదేశించారు. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) జే అరుణశ్రీ డీజిల్ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య వాహనాల డ్రైవర్ల నుంచి నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ వివరాలు సేకరించారు. అవకతవకలకు బాధ్యుడైన హెల్త్ అసిస్టెంట్ కిరణ్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆర్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఓ శంకర్‌రావుకు అదనంగా పారిశుధ్య విభాగం వాహనాల నిర్వహణ, పెట్రోలు, డీజిల్ మంజూరు బాధ్యతలు అప్పగించారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు, హోటళ్లు, రెస్టారెంట్ల తనిఖీలలో ఆరోపణలున్నాయని, ఆ దిశగా ప్రక్షాళన చేపట్టాలని పలువురు కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్‌రూరల్, సెప్టెంబర్ 14: హైదరాబాద్‌లో ఈ నెల 15నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి 11వ ఇంటర్ డిస్ట్రిక్ యోగాసనా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని జీ అక్షిత (9వ తరగతి) ఎంపికైందని ప్రిన్సిపాల్ సీహెచ్ గిరిజ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అక్షితను వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ జాహ్నవి, పీఈటీ అంజలి అభినందించారు.

స్పెషల్ క్యాంపెయిన్‌పై సమీక్ష

గోదావరిఖని, సెప్టెంబర్ 14: సింగరేణిలో స్పెయిన్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమ నిర్వహణపై శనివారం సింగరేణి భవన్ నుంచి సంస్థ డైరెక్టర్ (పీఅండ్ పా) జీ వెంకటేశ్వరరెడ్డి జీఎంలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారత ప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశాల మేరకు అక్టోబర్ 2నుంచి 31వ వరకు సింగరేణి వ్యాప్తంగా స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా ఈ నెల 16 నుంచి 30వరకు సంస్థ కార్యాలయాలు, గనుల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గనుల వద్ద స్క్రాప్‌నూ తీసివేయాలని, కార్యాలయంలో పెండింగ్ ఫల్స్‌ను పూర్తి చేయాలన్నారు. రికార్డు గదులను శుభ్రపరుచుకోని క్రమపద్ధతిలో పొందుపరుచాలని జీఎంలను ఆదేశించారు. అనంతరం నోడల్ ఆఫీసర్ రవికుమార్ 4.0లో చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఇక్కడ సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, జీ వెంకటేశ్వరరెడ్డి, జీఎం మార్కెటింగ్ రవిప్రసాద్, ఏరియాల జీఎంలు ఉన్నారు.

సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించాలి

- లేదంటే 19న జీఎం ఆఫీస్‌ల ఎదుట ధర్నా చేస్తాం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

యైటింక్లయిన్ కాలనీ, సెప్టెంబర్ 14: 2023-24 సంవత్సరానికి సంబంధించి సింగరేణి సంస్థ ఆర్జించిన వాస్తవ లాభాలు, వాటాను ప్రకటించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 19న సంస్థ వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు శనివారం కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం గడిచి ఐదునెలలు పూర్తయినా ఇప్పటికి లాభాలు ఎంత వచ్చాయో ప్రకటించకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. దసరా ఇంకా నెల రోజులు కూడా లేదని, అయినా లాభాల వాటా గురించి తెలియకపోవడంతో కార్మిక వర్గం నిరాశతో ఉందన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు నిర్లక్ష్య ధోరణిని అవలంబించడం సరికాదన్నారు. వరద విపత్తు ప్రాంతాలకు సింగరేణి కార్మికుల ప్రమేయం లేకుండా బేసిక్ వేతనంలో కోత విధించడాన్ని ఖండించారు. సమావేశంలో ఆర్జీ-2 ఏరియా నాయకులు నూనె కొమురయ్య, ఐలి శ్రీనివాస్, పర్లపల్లి రవి, చిలుపురి సతీశ్, మల్లేశ్వరరావు, చౌడ శ్రీనివాస్, కమలాకర్, రవి, శ్రీనివాస్, చంద్రశేఖర్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంజినీర్స్ డే

రామగిరి, సెప్టెంబర్ 14: మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఇంజినీర్స్ డే నిర్వహిస్తున్నామని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్, జీఎం కాంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎన్టీపీసీ డీజీఎం అప్పారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా టెక్నికల్ సెమినార్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సింగరేణి ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఎన్టీపీసీ జీఎం రాజశేఖర్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

సీపీ అభినందనలు

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 14: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేయగా బందోబస్తులో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. హోంగార్డు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పర్యటన, సభ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నందుకు సీపీ అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOTS FOR SALE
★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

గమనిక
క్లాస